సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 24 । మార్చి । 2023



రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు

కోడూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుండాల పెంచలయ్య తన పొలంలో నాటిన ఫెన్సింగ్ రాళ్లను టీడీపీకి చెందిన కొందరు ధ్వంసం చేశారు. - 8లో



గుర్తింపులేని ఆస్పత్రులపై కఠిన చర్యలు

గుర్తింపులేని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని పీఎస్‌పీఎన్‌డీటీ జిల్లా అధికారి దేవశిరోమణి అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.120
రెండోరకం	రూ.56	రూ.88

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 233 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	558
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 172.46 కిలోలు





న్యూస్‌రీల్

మాజీ సర్పంచ్‌పై దాడి:

కలకడ : మాజీ సర్పంచ్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుధవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రప్ప జీవనాధారం కోసం గ్రామ సమీపంలో చిల్లరదుకాణం ఏర్పాటు చేసుకోవడానికి మట్టితో చదును చేస్తుండగా అదే గ్రామానికి చెందిన మల్లయ్య, జయచంద్ర, వారి అనుచరులు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు గుర్రప్ప గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డిప్యూటీ కలెక్టర్‌గా సందీప్ కుమార్

రాయచోటిటౌన్ : హంద్రీనీవా సుజల స్రవంతి మదనపల్లె డివిజనల్ డిప్యూటీ కలెక్టర్‌గా కిడారి సందీప్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అన్నమయ్య జిల్లా పరిధిలోని హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 డిప్యూటీ కలెక్టర్‌గా త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో రేపు ప్రారంభోత్సవాలు

కలికిరి: కలికిరి సమీపం పాళెం వద్ద ఉన్న సీఆర్‌పీఎఫ్(సీఏటీ-3) కేంద్రం ఆవరణలో నూతనంగా నిర్మించిన క్వార్టర్ గార్డ్, 10 పడకల ఆసుపత్రిని శనివారం కేంద్ర మంత్రి అమిత్ షా వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని డిప్యూటీ కమాండెంట్ ఏకే సింగ్ తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులను ఆహ్వానించామన్నారు.

నేత్రదానం



హరిహర ప్రసాద్

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణం బోస్ నగర్‌కు చెందిన కుప్పం హరిహర ప్రసాద్ (67) గురువారం మృతి చెందారు. తాను మరణించిన తర్వాత తన కళ్లు దానం చేయాలని సూచించడంతో ఆయన కోరిక మేరకు భార్య పద్మావతి, లయన్స్ క్లబ్ సభ్యుడు కొత్త సుదర్శన్‌లు పులివెందులకు చెందిన స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే వారి ఇంటికి వెళ్లిన టెక్నీషియన్ హరీష్ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు. ఆయన నేత్రదానంతో మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించినవారవుతారని ఆయన పేర్కొన్నారు.

అతివలకు ఆసరా

ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఈనెల 25న మూడో విడత సొమ్ము ఖాతాలకు జమ చేయనున్నారు.

- జిల్లాలో 22,220 గ్రూపులకు మూడో విడత సొమ్ములు
- ఈనెల 25న సీఎం చేతులమీదుగా విడుదల
- జిల్లాకు రూ. 198.52 కోట్ల మేర ఒనగూరనున్న ప్రయోజనం
- ఈనెల 25 నుంచి ఏప్రిల్ 5 వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- తొలి, మలి విడతల్లోనూ ఆసరా కింద జిల్లాకు భారీగా నిధులు





సాక్షి రాయచోటి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్కా చెల్లెమ్మల రుణం తీర్చుకుంటోంది. అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి వారికి ఇచ్చిన హామీల అమలుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అమలు చేస్తున్నారు. మహిళలను అన్ని రంగాల్లో ఆర్థికంగా ఒకవైపు బలోపేతం చేస్తూనే, మరోవైపు నిలదొక్కుకునేలా తోడ్పాటు అందిస్తున్నారు. అన్ని విషయాల్లోనూ వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తూ వారి మనసుల్లో సీఎం చెరగని ముద్ర వేసుకుంటున్నారు. ప్రధానంగా ఇప్పటికే వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతోపాటు చేయూత లాంటి పథకాలతో అండగా నిలబడిన ప్రభుత్వం డ్వాక్రా రుణమాఫీలో భాగంగా మరో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ముల విడుదలకు నడుం బిగించింది. అందులో భాగంగా ఈనెల 25వ తేదీన స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో సొమ్ములు జమ చేసేందుకు సన్నద్ధమైంది.

జిల్లాలో 22,220 గ్రూపులకు ప్రయోజనం

అన్నమయ్య జిల్లాలో ఉన్న డ్వాక్రా సంఘాల గ్రూపు సభ్యులందరికీ ప్రయోజనం ఒనగూరేలా ప్రభుత్వం పథక రచన చేసింది. ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో ఎన్నికల నాటికి తీసుకున్న డ్వాక్రా రుణాలన్నింటినీ మాఫీ చేస్తానని ఇచ్చిన మాట మేరకు హామీ నెరవేరుస్తున్నారు. జిల్లాలోని 22,220 గ్రూపుల్లోని సభ్యులందరికీ సంబంధించి సుమారు రూ. 198.52 కోట్ల మేర నిధులను విడుదల చేయనున్నారు. అందుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరులో నిధులను విడుదల చేయనున్నారు.

మూడవ విడతగా వైఎస్సార్ ఆసరా

రాష్ట్ర వ్యాప్తంగా మహిళలందరికీ వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడవ విడత సొమ్ములను శనివారం ఖాతాలకు జమ చేయనున్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లాలో తొలి, మలి విడతల్లో సుమారు రూ. 400 కోట్ల మేర జిల్లాలోని మహిళలందరికీ సొమ్ములు అందించారు. మూడవ విడత కింద అందించేందుకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సొమ్ములకు సంబంధించి కలెక్టరేట్ గిరీషా చేతుల మీదుగా సొమ్మును జిల్లాకు విడుదల చేయనున్నారు.

వారం రోజులపాటు ఆసరా ఉత్సవాలు:

అన్నమయ్య జిల్లాలో ఈనెల 25 నుంచి వారం రోజులపాటు వైఎస్సార్ ఆసరా పథకం ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా కలిగిన ప్రయోజనాన్ని వివరించనున్నారు. మరోవైపు నియోజకవర్గాలకు సంబంధించి ఎమ్మెల్యేల ద్వారా నిధులకు సంబంధించిన చెక్కులను స్వయం సహాయక సంఘాల గ్రూపులకు అందజేయనున్నారు. అంతేకాకుండా దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు అధికారులు ముందుకు వెళుతున్నారు.

నియోజకవర్గాల వారీగా స్వయం సహాయక గ్రూపులు, పడనున్న సొమ్ము వివరాలు

నియోజకవర్గం	ఎస్‌హెచ్‌జీ గ్రూపులు	లబ్ధి మొత్తం (రూ.కోట్లలో)
రైల్వేకోడూరు	3338	29.57
మదనపల్లె	3443	32.66
పీలేరు	5207	50.33
రాజంపేట	2421	21.45
రాయచోటి	3074	21.89
తంబళ్లపల్లె	4737	42.61
మొత్తం	22220	198.52

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అన్నమయ్య జిల్లాలో మహిళలందరూ కూడా ఆర్థికంగా రాణించాలి. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే సొమ్ములను సద్వినియోగం చేసుకోవాలి. ఏదైనా చిన్నపాటి వ్యాపారాలతో అభివృద్ధి పథంలో పయనించాలి. ఒక్క అన్నమయ్య జిల్లాకు సంబంధించే రూ. 195 కోట్ల మేరకు నిధులు విడుదల చేయనున్నారు.
– గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

టాలెంట్ హంట్



- మహిళా క్రికెటర్లకు భలేచాన్స్
- ఎంపికైతే మూడేళ్ల పాటు శిక్షణ
- స్కాలర్‌షిప్ సౌకర్యం
- రేపు కడప నగరంలో ఎంపికలు

కడప స్పోర్ట్స్: భారత దిగ్గజ క్రీడాకారులైన రవిశాస్త్రి, బి.అరుణ్‌కుమార్, ఆర్. శ్రీధర్‌ల నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న బియాండ్ క్రికెట్ అకాడమీలో ప్రవేశాల కోసం టాలెంట్ హంట్ నిర్వహించనున్నారు. హిందూస్థాన్ యూనివర్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఎంపికైన క్రీడాకారిణులకు మూడు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్‌తో పాటు ప్రత్యేక శిక్షణ, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించి అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌లో మెలకువలు నేర్పుతారు. ఈ అకాడమీలో ప్రవేశాల కోసం ఈనెల 25వ తేదీన కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65 మందిని ఎంపిక చేసి, వీరికి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మందిని అకాడమీకి ఎంపిక చేసి వారికి అన్ని సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

- వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో మహిళల క్రికెట్ అకాడమీకి సంబంధించిన ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారిణులు 25వ తేదీ ఉదయం 8.15లోపు మైదానానికి చేరుకోవాలని సూచించారు. పోటీలో పాల్గొనదలచిన క్రీడాకారిణులు క్రికెట్ యూనిఫాం, ఆధార్‌కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9052748786, 7013184808 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ అధికారులు, ప్రజాప్రతినిధులు

వాల్మీకిపురం: శ్రీరాముడి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక పట్టాభిరామాలయంలో జెడ్పీటీసీ నిర్మల, సర్పంచ్ గంగులమ్మతో కలసి వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రారంభమవుతాయన్నారు. అలాగే ఏప్రిల్ 1న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందన్నారు. 2వ తేదీ రథోత్సవం, 5వ తేదీ పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు మునిచెంగల్‌రాయులు, కృష్ణమూర్తి, దుశ్యంత్, నాగరాజు, మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, సురేష్ రెడ్డి, ఆనంద, నాగరాజ, శివారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డెమో రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: నంద్యాల–కడప–నంద్యాల మధ్య తిరుగుతున్న నంద్యాల డెమో రైలు (07284/85) ఈనెల 31వ తేదీ వరకు రద్దు చేశామని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు నిర్వహణతోపాటు వసతుల ఆధునీకరణ కోసం తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

ప్రతి పంచాయతీలో చెత్తనుంచి సంపద

- డీపీఓ ధనలక్ష్మి

కలకడ: జిల్లాలోని ప్రతి పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారు చేయాలని అన్నమయ్య జిల్లా డీపీఓ ధనలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని కలకడ పంచాయతీలోని చెత్తసేకరణ కేంద్రాన్ని ఆమె గాలివీడు మండల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలకడ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలకు పురుషులకంటే అధికంగా అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. విద్యార్థుల హాజరు, మెనూప్రకారం రుచికరమైన భోజనం, అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ, సర్పంచ్ ప్యారీజాన్, షావత్‌అల్లీఖాన్, పంచాయతీ కార్యదర్శి నందిని, శివాజీ, ఎస్‌ఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి ప్రాధాన్యం

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్కూల్ ఎడ్యుకేషన్, మహిళా, శిశు సంక్షేమ ప్రభుత్వ పథకాలు, రీసర్వే పురోగతి తదితర అంశాలపై కలెక్టర్లు, జేసీలతో చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి, సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్‌లు వేర్వేరుగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీసీ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అధికారుల సమీక్ష అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ముఖ్యమైన ఎనిమిది అభివృద్ధి సూచికలలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. మనబడి, నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జగనన్న గోరుముద్దను పటిష్టంగా అమలు పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు , పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు.



అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ తమీమ్ అన్సారియా

గ్రామాలలో రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

గ్రామాలలో రీ–సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే నాణ్యతా ప్రమాణాల తనిఖీ, గ్రౌండ్ ట్రూతింగ్, ఫైనల్ ఆర్‌ఓఆర్, డ్రోన్ ఫ్లెయింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు.

అవగాహనతో క్షయ నివారణ

- సకాలంలో నిర్ధారణ చేసుకోవాలి
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం
- టీబీ రోగులకు ఆసరాగా ని-క్షయ పథకం
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

మదనపల్లె సిటీ: క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరం. క్షయను త్వరగా గుర్తించి మందులు పూర్తి స్థాయిలో వాడితే పూర్తిగా నయం అవుతుంది. మందులు మధ్యలో మానేసి నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు వదులుకోవాల్సి ఉంటుంది. ఒకనాడు క్షయ అంటే అమ్మో అని పారిపోయేవారు. ఇప్పుడు ఇలా కాదు. ఈ వ్యాధికి అడ్డుకట్ట వేయడానికి మంచి మందులు వచ్చాయి. వైద్యుల సూచనల ప్రకారం క్రమం తప్పకుండా వాడితే అందరిలా ఆరోగ్యంగా జీవించవచ్చు. శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.....

- జిల్లాలో టీబీ రోగులు 1448 మంది ఉన్నారు. మదనపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, వాల్మీకిపురంలలో టీబీ కేంద్రాలు ఉన్నాయి.

క్షయ గురించి తెలుసుకుందాం...

1845–1910 మధ్య కాలంలో రాబర్ట్ కోచ్ అనే జర్మన్ శాస్త్రవేత్త టీబీకి కారణమైన ట్యూబర్ కిలోసిస్ బ్యాక్టీరియాను కనుగొన్నారు. ఈ బ్యాక్టీరియా ద్వారానే క్షయ వ్యాధి వస్తున్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా మార్చి 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ వ్యాధి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆధునిక నిర్ధారణ పరీక్షలు

జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధి నిర్ధారణకు కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్ష పరికరాలను పంపింది. జిల్లాలో ఎనిమిది టీబీ యూనిట్లు ఉన్నాయి. ఇందులో సీబీ న్యాట్ మిషన్లతో పాటు ఆర్‌టీపీసీఆర్ పరికరాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గళ్లలో టీబీ క్రిములు అతి తక్కువ సంఖ్యలో ఉన్నా కూడా వాటిని గుర్తించి వ్యాధి నిర్ధారణ చేస్తారు. దీంతో పాటు ఎక్స్‌ట్రా పలమనరీ కేసులు ఎక్స్‌రే ద్వారా కూడా టీబీని గుర్తిస్తారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

టీబీ రోగులకు పౌష్టికాహారం

క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దే దిశగా చర్యలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా టీబీ చికిత్స పొందుతున్న వారికి ని-క్షయ్ మిత్ర పథకం ద్వారా పౌష్టికాహారం అందించే కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. క్షయ వ్యాధి బాధితులకు ప్రధానమంత్రి 'టీబీ ముక్త భారత్ అభియాన్' ని-క్షయ్ మిత్ర పథకం ద్వారా పలువురు రోగులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. జిల్లాలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇద్దరు టీబీ బాధితులను దత్తత తీసుకున్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న సిబ్బంది

- జిల్లాలో 336 మంది నిక్షయ మిత్రలుగా నమోదయ్యారు. వీరు 608 క్షయ వ్యాధి బాధితులను దత్తత తీసుకున్నారు. బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారాలు అందిస్తున్నారు. తద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి బాధితుడికి టీబీ నుంచి పూర్తిగా విముక్తి కలుగుతుంది.

టీబీ యూనిట్	నిక్షయ మిత్రలు
మదనపల్లె	86
రాయచోటి	80
లక్కిరెడ్డిపల్లె	45
నందలూరు	23
రైల్వేకోడూరు	14
పీలేరు	38
తంబళ్లపల్లె	7
వాల్మీకిపురం	43

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితం



జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్షయకు ఖరీదైన మందులు ఉచితంగా అందిస్తున్నాం. పౌష్టికాహారం నిమిత్తం ఇటీవల నిక్షయ్ మిత్ర ద్వారా దాతల సహకారంతో పౌష్టికాహారం అందిస్తున్నాం. ప్రజల్లో అవగాహన కల్పించడా నికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యాధి తగ్గుముఖం పట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. –డాక్టర్ శైలజ, జిల్లా టీబీ నివారణ అధికారి

రాజంపేట బార్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత

– తారాస్థాయికి చేరిన ఎన్నికల వివాదం



బార్ కార్యాలయం వద్ద వాగ్వాదం చేసుకుంటున్న న్యాయవాదులు

రాజంపేట : పదిమందికి న్యాయం చేయాల్సిన న్యాయవాదుల మధ్య రగడతో రాజంపేట బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దళితులు పోటీచేస్తారనే ఉద్దేశంతో కొందరి ఓట్లు తొలగించగా, వారు హైకోర్టుకు వెళ్లి ఓటు హక్కును దక్కించుకున్నారు. దీంతో న్యాయవాదులు ఎన్నికల రగడ తారాస్థాయికి చేరుకుంది. ముందస్తు ప్రణాళికతో బార్ వద్ద జూనియర్ న్యాయవాది దురుసుగా ప్రవర్తించడంతో సీనియర్ న్యాయవాది అడ్డుకుని చేయిచేసుకున్నాడు. దీంతో వీరు న్యాయవాదులా, వీధి రౌడీలా అంటూ కోర్టుకు వచ్చిన క్లైయింట్స్, పోలీసులు చర్చించుకుంటున్నారు. దీంతో బార్ అసోసియేషన్ ఎప్పుడు ఇలాంటి సంఘటన జరగలేదని పలువురు న్యాయవాదులు చర్చించుకుంటున్నారు. కాగా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో కులాల కుంపటి వివాదాన్ని రాజేసింది. ఈఎన్నికల్లో కేవలం ఎస్సీ, బీసీ, మైనార్టీల వర్గాలకు చెందిన న్యాయవాదులే టార్గెట్‌గా కనిపిస్తోంది. వీరి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభాకర్ అనే న్యాయవాది తాను దళితుడనే తన ఓటును తొలగించారంటూ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం

ఎస్పీ హర్షవర్ధన్ రాజు



నేర సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : జిల్లాలో నాటుసారా తయారీ కేంద్రాలు, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులను అన్నమయ్య జిల్లా ఎస్పీ వీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. గురువారం జిల్లా ఎస్ఈబీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. నాటుసార తయారీ, విక్రయాలలో ఎక్కువ కేసులున్న వారిపై పీడీయాక్ట్‌కు సిఫార్సు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.నాటుసారా తయారు చేసే గ్రామాల్లో అధికారులు రోజుకు రెండు, మూడు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల చెక్‌పోస్టుల వద్ద నిరంతరం ఆకస్మిక వాహన తనిఖీలు చేయాలన్నారు. ఈ క్రమంలోనే పక్క రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణ నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపటాలని మదనపల్లె, మొలకల చెరువు ఎస్ఈబీ సిబ్బందికి సూచించారు. ఇందుకోసం సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులను బలోపేతం చేయడానికి సాయుధ బలగాల నుంచి కూడా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణాలో సంబంధం ఉన్న అనుమానితులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి వారిని బైండోవర్ చేయించాలని తెలిపారు. నమోదు చేసిన కేసులలో ఇన్వెస్టిగేషన్‌ను త్వరితగతిన పూర్తిచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి తద్వారా నిందితులకు శిక్షపడేలా చూడాలని ఆదేశించారు. సీజ్ చేసిన వాహనాలను వేలంపాట ద్వారా విక్రయించాలన్నారు. నాటుసారా తయారు చేసిన కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని,వారు తిరిగి నాటుసారా జోలికి వెళ్లకుండా గౌరవ ప్రదమైన జీవితం జీవించేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఈ సమీక్షలో అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్ కూడా పాల్గొన్నారు.

గుర్తింపులేని ఆస్పత్రులపై కఠినచర్యలు



మాట్లాడుతున్న జిల్లా అధికారిణి దేవశిరోమణి

మదనపల్లె : గుర్తింపులేని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్స్‌పై కఠిన చర్యలు తప్పవని గర్భస్థ, పిండ, లింగ నిర్ధారణ నివారణ(పీఎస్‌పీఎన్‌డీటీ) జిల్లా అధికారిణి దేవశిరోమణి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్ సెంటర్లు, ల్యాబ్స్ డాక్టర్లు, సిబ్బందితో గణాంకాల నమోదు, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, ఫారం-7 నమోదు తదితర అంశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మదనపల్లె డివిజన్‌లో అధికసంఖ్యలో ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు గుర్తింపులేకుండా నడుస్తున్నాయన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ఈనెలాఖరులోగా గుర్తింపునకు నమోదుచేసుకుని ప్రక్రియ పూర్తిచేయకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. జిల్లాల విభజనలో భాగంగా మదనపల్లె డివిజన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలు అన్నమయ్యజిల్లా కేంద్రంలో లేవని, వెంటనే డివిజన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కాన్‌సెంటర్, ల్యాబ్‌సెంటర్ నిర్వాహకులు తమ వివరాలను అందించాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో రోగుల చికిత్సలపై మాత్రమే దృష్టిచూపుతూ, గణాంకాలు నమోదుచేయడంలో నిర్లక్ష్యం కనపరుస్తున్నారన్నారు. స్కాన్ సెంటర్ల నిర్వాహకులు లింగనిర్ధారణ చేయడాన్ని ఉపేక్షించేది లేదన్నారు. కచ్చితంగా ఆర్ఎంపీ, పీఎంపీ, స్కాన్‌సెంటర్, ల్యాబ్‌లకు తప్పనిసరిగా గుర్తింపు ఉండాల్సిందేనన్నారు. గుర్తింపులో భాగంగా సెంటర్‌లో ఉపయోగించే స్కాన్ మెషిన్ వివరాలను సైతం నమోదుచేయాలన్నారు. బెడ్‌లు కలిగిన ఆస్పత్రులకు కచ్చితంగా అన్ని రకాల ధృవపత్రాలతో పాటుగా ఫైర్ ఎన్ఓసీ లేకపోతే గుర్తింపు లభించదన్నారు. పీసీపీఎన్‌డీటీ నిబంధనలు ప్రతి స్కాన్ సెంటర్ నిర్వాహకులు పాటించాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో 43 ఆస్పత్రులు, 59 స్కాన్ సెంటర్లు మాత్రమే గుర్తింపు పొందాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ దివాకర్ బాబు, స్టాటిస్టిక్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాజగోపాల్, సీహెచ్ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ,ఎస్.ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు. గురువారం వేంపల్లె పంచాయతీ కూకటుమానుగడ్డ వద్ద కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది దాడి చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.2050 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నవయుగనాథ్ తెలిపారు. రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన బీదంమల్లికార్జున భార్య బీదంహేమలత(27) ఈనెల 19వతేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లవద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో భర్త మల్లికార్జున గురువారం నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన బాలిక దక్షిత

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది. పెద్దతిప్పసముద్రంకు చెందిన అంజి, సుశీల దంపతుల కుమార్తె దక్షిత(3) గురువారం ఇంటిముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. స్థానికులు పిచ్చికుక్కపై దాడిచేయడంతో పారిపోయింది. తీవ్రంగా గాయపడిన దక్షితను కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యచికిత్స అనంతరం బాలిక కోలుకుంటోంది.

కుక్క అడ్డురావడంతో బైక్‌ల బోల్తా

– ఇద్దరికి గాయాలు



గాయపడిన రియాజ్

మదనపల్లె : రోడ్డుపై కుక్క అడ్డుగా రావడంతో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... బుధవారం రాత్రి వాల్మీకిపురం మండలం బూడిదవేడుకు చెందిన సుధాకరరెడ్డి(23) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. పొలానికి నీరు పెట్టేందుకు ద్విచక్రవాహనంలో బోరువద్దకు బయలుదేరగా, మార్గమధ్యంలో రోడ్డుకు అడ్డుగా కుక్క దూరడంతో అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా వాల్మీకిపురం టౌన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన వలీసాహెబ్ కుమారుడు ఎస్.రియాజ్(28) పాల ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. గురువారం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో పుంగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని వలసపల్లె జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద అకస్మాత్తుగా వాహనానికి కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అగ్నిప్రమాదంలో ఒరిస్సావాసికి..

మదనపల్లె : అగ్నిప్రమాదంలో ఒరిస్సావాసి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బుద్దుబా (40) ఏడాది క్రితం చిత్తూరు జిల్లా పుంగనూరుకు వచ్చి ఇటుక బట్టీలో పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటుకల బట్టీవద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికంగా పని చేస్తున్నవారు గుర్తించి మంటలను అదుపు చేశారు. బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ ఆసుత్రికి తరించారు. ఔట్ పోలీసులు పుంగనూరు పోలీసులకు సమాచారం అందించారు.

భర్తపై భార్య దాడి

మదనపల్లె : భర్తపై భార్య దాడిచేసిన సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నీరుగట్టువారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్(37)కు భార్య రుక్మిణితో కుటుంబసమస్యలతో విభేదాలు ఏర్పడ్డాయి. కొంతకాలంగా రుక్మిణి భర్తకు దూరంగా పిల్లలతో కలిసి ఉంటోంది. ఈక్రమంలో బుధవారం రాత్రి పిల్లలను చూసేందుకు నీరుగట్టువారిపల్లెలోని ఆంధ్రాబ్యాంకు వీధిలో ఉంటున్న భార్య వద్దకు రెడ్డిశేఖర్ వెళ్లాడు. విభేదాల కారణంగా మరోసారి ఇద్దరు గొడవపడ్డారు. ఈ గొడవలో రుక్మిణి రెడ్డిశేఖర్‌ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరచింది. రెడ్డిశేఖర్ కేకలు వేయడంతో స్థానికులు వచ్చి అడ్డుపడ్డారు. అయితే అప్పటికే గాయపడిన రెడ్డిశేఖర్‌ను వారు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై..

మదనపల్లె : భూ సమస్యలతో జరిగిన గొడవలో వృద్ధురాలిపై ఆమె దాయాదులు దాడిచేసిన ఘటన కలకడ మండలం ఎనుగొండపాళెం పంచాయతీలో జరిగింది. భద్రెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య వెంకటలక్ష్మమ్మ(65) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తోంది. ఈమె కుటుంబీకులు గతంలో బోరు వద్ద దాయాదుల పొలంలో పైపును పూడ్చారు. అవి తొలగించే విషయమై కొన్ని రోజులుగా ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇదే విషయమై ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఆవేశానికి గురైన తోడికోడలు రెడ్డెమ్మ ఆమె కుమార్తె లక్ష్మీదేవి ఇద్దరూ కలిసి బాధితురాలు వెంకటలక్ష్మమ్మపై దాడిచేశారు. గొడవలో బాధితురాలు తీవ్రంగా గాయపడగా ఆమెను 108 అంబులెన్స్‌వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

భార్యపై హత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ గొడవల కారణంగా మద్యం మత్తులో భార్యపై భర్త కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు.. పట్టణంలోని ఏ.వి.నాయుడు కాలనీకి చెందిన సందీప్‌కుమార్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య షెహనాజ్(22), ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసమస్యల కారణంగా అయిదునెలల క్రితం షెహనాజ్ ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టినిల్లు అయిన బెంగళూరుకు వెళ్లిపోయింది. తిరిగి కాపురానికి రాలేదు. ఈక్రమంలో ఉగాది పండుగ సందర్భంగా మూడురోజుల క్రితం పిల్లలతో షెహనాజ్ మదనపల్లెకు వచ్చింది. భర్త ఉంటున్న ఇంటిని ఖాళీ చేయించి తనతో బెంగళూరుకు రావాల్సిందిగా పట్టుపట్టింది. దీంతో ఇద్దరిమధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో ఆవేశానికి గురైన సందీప్‌కుమార్ కత్తితో భార్య షెహనాజ్‌పై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

పులివెందుల : ఈత సరదా యువకుడి ప్రాణం తీసింది.ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. పులివెందుల పట్టణంలోని యర్రగుడిపల్లెకు చెందిన లక్కె సుబ్బరాయుడు, సుబ్బమ్మల రెండో కుమారుడు గణేష్ స్నేహితులతో కలసి బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోని బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈతరాని గణేష్ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బావిలో నుంచి గణేష్‌ను వెలికి తీసి 108 వాహనంలో పులివెందుల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఐదుగురి అరెస్ట్



నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 75లీటర్ల నాటుసారా, కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి బసినికొండ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పుంగనూరు మండలం పెద్దతాండా నుంచి ఒక ఆటోలో నాటుసారా తరలిస్తున్న బసినికొండకు చెందిన గౌతమ్(33), సంధ్యారాణి(32) దంపతులతో పాటు ఆటోడ్రైవర్ పఠాన్ సయ్యద్‌బాషా, నాటుసారా సరఫరా చేసిన సుగాలిమిట్టకు చెందిన బుక్కేనాగరాజనాయక్(55)ను అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి 75లీటర్ల నాటుసారా, ఆటోను సీజ్ చేశామన్నారు. అలాగే గురువారం మధ్యాహ్నం బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద వాహనాల తనిఖీలో వేపూరికోటకు చెందిన శివకంతారెడ్డి కారులో 360 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. రెండుకేసుల్లోనూ ఐదుగురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో రాయచోటి సీఐ శంకరమల్లయ్య, బార్డర్ పెట్రోలింగ్ ఎస్ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్స్ త్రిపురేంద్రుడు, మునిరామయ్య, హరికుమార్, దామోదర్ పాల్గొన్నారు.

కురుబ ఎస్టీ సాధనపై 4న రౌండ్‌టేబుల్ సమావేశం



కురుబ సంఘ కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

మదనపల్లె : రాష్ట్రంలోని కురుబ, కురుమ, కురువ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 4న ఢిల్లీలోని ఆంధ్రాభవన్‌లో కుల ప్రతినిధులు, యువత, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. గురువారం కురవంకలోని కురుబ సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు, కర్ణాటక, గోవా, కేరళలోని కురుబ, కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అక్కడి సంఘాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చిన నేపథ్యంలో అసెంబ్లీలో తీర్మానాలు చేసి కేంద్రప్రభుత్వానికి నివేదికలు పంపాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కురుబ, కురుమలను గుర్తించి రాజకీయంగా రాజ్యసభకు ఒకరిని, ఎంపీగా ఒకరిని, మంత్రులుగా ఒకరికి, ఎమ్మెల్యేలుగా ఇద్దరికి, బీసీ కమీషన్ మెంబర్, ముగ్గురికి కార్పొరేషన్ చైర్మన్‌లుగా అవకాశం కల్పించారన్నారు. కురుబ, కురుమల ప్రధాన జీవనాధారం గొర్రెల పెంపకమని, వాటి పోషణ, జీవనోపాధి నిమిత్తం అడవుల్లో సంచరించే తమను షెడ్యూల్ ట్రైబ్స్‌కు చెందిన వ్యక్తులుగా గుర్తించి ఎస్టీ జాబితాలో చేర్చాలని ఢిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో కురుబ సంఘ ప్రతినిధులు కప్పలరాజన్న, గుడిరామాంజులు, రాజ్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లకు పోస్టాఫీసుల్లోనే అధిక వడ్డీ

తపాలా శాఖ ఎస్పీ ఎం.చెన్నకేశవులు



పెద్దతిప్పసముద్రం : ఖాతాదారులు పోస్టాఫీసుల్లో ఎలాంటి డిపాజిట్లు చేసినా ఇతర బ్యాంకుల కంటే తపాలా శాఖ ద్వారా అధిక వడ్డీ ఇస్తోందని చిత్తూరు డివిజన్ పోస్టల్ ఎస్పీ ఎం.చెన్నకేశవులు అన్నారు. గురువారం ఆయన స్థానిక సబ్ పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల కన్నా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారానే అధిక బోనస్ వస్తుందన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా ఏడాదికి రూ.399లు చెల్లిస్తే రూ.10 లక్షల దాకా ఎక్స్‌గ్రేషియా మంజూరు అవుతుందన్నారు. చిత్తూరు డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 115 బీపీఎం పోస్టుల భర్తీలు, పదోన్నతుల ప్రక్రియ చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు డివిజన్‌లో 2 హెడ్ పోస్టాఫీసులు, 51 సబ్ పోస్టాఫీసులు, 374 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉండగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో మదనపల్లి హెడ్ పోస్టాఫీసు, చిత్తూరు డివిజన్‌లో చౌడేపల్లి మండలం నంజంపేట బ్రాంచి పోస్టాఫీసు, అన్నమయ్య జిల్లా పరిధిలో బి.కొత్తకోట సబ్ పోస్టాఫీసు ప్రథమ స్థానంలో, పెద్దతిప్పసముద్రం సబ్ పోస్టాఫీసు రెండో స్థానంలో నిలిచాయన్నారు. 85 బ్రాంచి పోస్టాఫీసులు చివరి స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలోనే చిత్తూరు డివిజన్ పరిధిలో లక్షా 10 వేల ఖాతాలు తెరిచామన్నారు. ఈ నెలాఖరులోగా మరో 30 వేల ఖాతాలు తెరిచేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట స్థానిక ఎస్‌పీఎం రెడ్డిశేఖర్, జీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

‘వేగం’షార్ట్ ఫిల్మ్‌కు ప్రథమ బహుమతి



ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులు అధ్యాపకులు

కురబలకోట : మదనపల్లె దగ్గరున్న అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన ‘వేగం’ అనే షార్ట్ ఫిల్మ్‌కు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ గురువారం తెలిపారు. కలికిరి జేఎన్టీయూలో జాతీయ స్థాయిలో షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు బాషా, సద్దాం, నిరంజన్, సుబ్బాన్, నందిని, శ్రీకాంత్, మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అమృత పాండా, జయప్రకాష్ రోడ్డు ప్రమాదాలపై ×వేగం౯ అనే షార్ట్ ఫిల్మ్ తీసి ప్రదర్శించారు. అతి వేగం వల్ల నష్టపోయిన కుటుంబం పడే వేదనను కళ్లకు కట్టినట్లు చూపించినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. దీనికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి రావడంతో పాటు నగదు పురస్కారం, ప్రశంసా పత్రం లభించినట్లు తెలిపారు. కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల విద్యార్థులను అభినందించారు.

నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తాం



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

లక్కిరెడ్డిపల్లి : జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం అందిస్తామని అన్నమయ్య జిల్లా ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో 120 మంది బాధితులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు గజానికి రూ. 4,563 అందిస్తామని తెలిపారు. రోడ్డుకు ఎక్కువస్థలాలు పూర్తి స్థాయిలో ఇళ్లు కోల్పోయిన వారు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తిగా పరిశీలించి ఎవరినీ ఇబ్బందులు పెట్టకుండా నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. 120 మంది డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు. అందరూ ఒప్పుకున్నాకనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహులు, నేషనల్ జాతీయ రహదారి ఏఈ రఘునాథ్, సర్వేయర్ కరిముల్లా, ఆర్ఐ సమ్మత్ ఖాన్ బాధితులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు

పొలంలో ఫెన్సింగ్‌రాళ్లు ధ్వంసం చేశారని ఫిర్యాదు



ధ్వంసం చేసిన ఫెన్సింగ్ రాళ్లను చూపుతున్న పెంచలయ్య

రైల్వేకోడూరు : తెలుగుదేశం నాయకుల అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. వారి ఆగడాలు భరించలేక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గురువారం కోడూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గుండాల పెంచలయ్య అనే వ్యక్తి చియ్యవరం కమ్మపల్లి సమీపంలోని సర్వేనంబర్ 369-3లో ఉన్న తన పొలంలో నాటిన ఫెన్సింగ్ రాళ్లను టీడీపీకి చెందిన కొందరు ధ్వంసం చేసినట్టు సీఐ విశ్వనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. 1980 సంవత్సరంలో తన తండ్రి చిన్న చెంగయ్య పేరుతో ప్రభుత్వం పట్టా ఇచ్చిందని పెంచలయ్య పేర్కొన్నారు. నాటినుంచి తమ ఆధీనంలో ఉన్న పొలంలో వారంరోజుల క్రితం ఫెన్సింగ్‌రాళ్లు నాటించామన్నారు. అయితే చియ్యవరం కమ్మపల్లికి చెందిన యేదోటి నారాయణ, యేదోటి హరినాథ్, గడికోట చంద్రయ్యలు బుధవారం రాత్రి కొంతమంది మనుషులతో కలిసి ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేశారన్నారు. దీంతో రూ. 2లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు. గతంతోనూ పొలంలో పనులను వీరు అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసినవారు ఎవరనేది విచారిస్తామని, బాధితుడికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడండి

రాయచోటిటౌన్ : పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ రాయచోటి పాత్రికేయులు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కోరారు. గురువారం ‘సేవ్ జర్నలిజం డే’సందర్భంగా ఆయనకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా అన్నమయ్య జిల్లా ఏపీయుడబ్ల్యూజే నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు ప్రకటించాలని, పక్కా గృహాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే నాయకులు శ్రీనివాస్, మేఘశ్యామ్, పివి నాగయ్య, సాయి ప్రతాప్‌రెడ్డి, రమేష్ రాజు, వెంకట్రామ రాజు, భువనేశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, రాజమోహన్ పాల్గొన్నారు.